# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కలవరం

**కల అనేది ఒక వరం. అందుకే కలవరం అనే మాటని తెగ వాడేసారు మన సినీ కవులు.**

'కవరమాయే మదిలో... నా మదిలో' అంటుంది పాతాళ భైరవిలో రాజకుమార్తె. అంటే మన గుండె గాభరా, బీ.పి మొదలైన రోగం కాదు... వరం. అంటే ఆమెకి కలలో హీరో కనిపించడం ఒక వరం అన్నమాట.

అలాగే "కాదు సుమా కల కాదు సుమా" అంటుంది 'కీలుగుర్రం'లో హీరోయిన్. మదిలో కలిగే ఈ మధుర భావనలూ, ఎదురుగా నిలబడ్డ కుర్రవాడూ, కల ఏమో అని భయం.

'కల కానిదీ విలువైనదీ బ్రతుకు. దాన్ని కన్నీటి ధారలలో గడిపెయ్యకు' అంటాడు ఒక ప్రియుడు. అంటే పోయిందంతా కల. మిగిలిందే జీవితం. అసలీ కలకి చాలా కమర్షియల్ వాల్యూ ఉంది. కురుక్షేత్రం సినిమాలో మ్రోగింది కళ్యాణ వీణా' పాటలో 'కలవరించీ... కల వరించీ' అని విరిచి అద్భుత ప్రయోగం చేసారు. కలవరింతలూ, కలవరించడాలూ రెండూ ప్రేమికులకి ఆనంద దాయకమే కదా!

ఇంక వ్యాపార ప్రకటనల్లో 'కల' అనే మాటని యధేచ్ఛగా వాడేస్తారు. 'మీ సొంత ఇంటి కలని నిజం చేసుకోండి.', 'మీ పిల్లవాడి భవిష్యత్తు గురించి కలలు కంటున్నారా? అయితే మా పాలసీ తీసుకోండి. లేదా మా స్కీములో చేరండి.' అంటూ ఇంతకీ ఈ కలలూ అవి నిజం చేసుకోడాలూ అన్నీ మన అభూత కల్పనలా? నిజంగా మనకి కావల్సినదాన్ని గురించో, ఫలానాగా అయి పేరు తెచ్చుకోవాలి అనో నిజంగా కలలు కంటామా?

నాకైతే కల అనేది మనకి తెలీకుండా జరిగే శుద్ధ పనికి రాని చర్య. ఎందుకంటే నాకొచ్చే ఒక్క కలకీ అర్థం ఉండదు. లాజిక్ అసలే ఉండదు. కొన్ని కొన్నిసార్లు రాత్రంతా నిద్రలేకుండా భయంతో జాగరణ చేసి, తెల్లవారాక అసలు గుర్తు ఉండవు.

అయితే ఇంకా భయంకరమైన విషయం ఏమిటంటే ఎవరి కలలో వాళ్ళే హీరోలూ, లేదా హీరోయిన్‌లు... కానీ పక్కవాళ్ళ కొచ్చే కలల్లో మనం జోకర్లుగా ఉండడం వాళ్ళు ఆ విషయం మనకి చెప్పడం చాలా భయంకరం.

మొన్న మా అమ్మ ప్రొద్దుటే కాఫీ ఇస్తూ "రాత్రి నాకో కల వచ్చిందే!" అంది.

"ఏం వచ్చిందీ?" అన్నాను కాఫీ తాగుతూ.

"మనం ఇద్దరం డాబా మీదకి ఎక్కాం. అక్కడ మన డాబా మీదనుండి ఎదురుగుండా ఉన్న ఇంటి డాబా మీదకి ఒక బ్రిడ్జిలాంటిది ఉంది. నువ్వు నడుస్తూ వాళ్ళ డాబా మీదకి వెళ్ళి అక్కడున్న పిరమిడ్ లాంటిది చూపించి 'ఇక్కడే నేను నా నగలు దాస్తాను' అన్నావు" అంది.

నేను ఉలిక్కిపడ్డాను.

మా అమ్మ కంటిన్యూ చేసింది. "నేను నిన్ను వెంటనే అడిగాను. పిచ్చి మొహమా! మన ఇంటి మీద కాకుండా ఎదర ఇంటి మీద నీ నగలు దాయడం ఏవిటే? అని" అంది.

"నేనేమన్నానూ?" ఆత్రుతగా అడిగాను.

"ఎదురింటి వాళ్ళకి మెట్లు లేవు. వాళ్ళు డాబా మీదకి ఎక్కలేరు అన్నావు" అంది.

నాకు నా ఫూలిష్‌నెస్ మీదా నా జీవితం మీదా విరక్తి వచ్చేసింది.

ఆవిడ కల కాబట్టి ఆవిడ తెలివిగా ఉంది. నేను ఆవిడ కలలోకెళ్ళి బుద్ధి లేని పనులు చేస్తున్నాను. ఇదెంత బాధాకరం. అవేవో నా కలలో నేను చేసినా ఇంత బాధ ఉండేది కాదుగా. ఇప్పుడు నేను "ఇంత తెలివి తక్కువగా కలలో కూడా మాట్లాడను" అనే రైట్ పోగొట్టుకున్నాను. ఛీ అసలు పక్క వాళ్ళ కల్లోకి పనికట్టుకుని వెళ్ళడం ఎందుకు చెప్పండీ?

ఇది విని మా ఆయన పెద్దగా నవ్వి "నా కలలో కొచ్చి ఇంకా ఫూలిష్‌గా మట్లాడ్తుంది మీ అమ్మాయి" అన్నారు.

ఆయన ఏ ఛాన్సూ వదిలి పెట్టుకోరు. మా అమ్మ వైపు మిర్రి మిర్రి చూసాను. అల్లుడు అక్కడ ఉండగా ఈవిడ స్వప్న వాసవదత్తలా ఈ స్వప్న వృత్తాంతం ఎందుకు చెప్పడం?

ఇంక మా అశ్విన్ వచ్చి "ఏమైంది అమ్మమ్మా మళ్ళీ చెప్పు" అన్నాడు. నేను వద్దని ఎంత ఆపినా వినకుండా ఆవిడ రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ చెప్పింది.

"ఇదేం చూసావు? చిన్నప్పుడు మేం ఎప్పుడైనా నిద్రలేపితే ఛళ్ళున కొట్టేది చెంప మీద తెలుసా?"అన్నాడు.

"నేనెప్పుడు కొట్టానురా?" అన్నాను.

వాడు గుర్తుచేసాడు. నిజంగా అది కొట్టవలసిన విషయమే మరి.

ఒక రోజు నేను హోటల్‌కి వెళ్ళాను. సర్వర్ వచ్చాడు. బహుశా ఆబిడ్స్ తాజ్ అనుకుంట.

"ఏం కావాలి మేడం?" అన్నాడు.

"ఒక బటర్ మసాలా దోశ" అన్నాను.

అతను వెళ్ళిపోతుండగా పిలిచి `బాసుందీ కూడా` అన్నాను. అతను వెళ్ళిపోయాడు.

బాసుంది తినిపించడానికి మా నాన్నగారు ప్రత్యేకంగా ఏ పనీ లేకపోయినా ఆబిడ్స్ తీసుకెళ్ళేవారు.

ఇంతలో మసాలా దోశ ఎర్రగా కాలింది, పైన వెన్న వేసి తీసుకొచ్చి నా ముందు పెట్టాడు. నేను ఆశగా తుంచి బాగా వెన్న ముంచి నోట్లో పెట్టుకోబోయి ఆగి, పక్కనున్న కొబ్బరి చట్నీ టెంప్టింగ్‌గా ఉండడంతో దాంట్లో కూడా ముంచి, నోరు తెరిచి నోట్లో ముక్క పెట్టుకోబోతుండగా, ఎవరో చెయ్యి పట్టి రాక్షసంగా లాగేసారు.

నేను హఠాత్తుగా అమృత భాండం చేజారిన మోహినిలా పక్కకి చూస్తే, అప్పుడే స్కూల్ నుండి వచ్చిన నా ఏడేళ్ళ పెద్ద కొడుకు "అమ్మా.. అమ్మా.. ముష్టి అంకుల్ వచ్చాడు. ఏమైనా వెయ్యి.. రా.. మళ్ళీ వెళ్ళిపోతాడు" అని నా చెయ్యి పట్టిలాగుతూ కనిపించాడు. అప్పుడు అర్థమైంది. పక్కన మొగుడూ, పిల్లలూ లేకుండా నేను అంత ఆనందంగా, స్వేచ్ఛగా, ఒంటరిగా హోటల్‌కి ఎందుకెళ్ళానో? అది కల. ఇది వాస్తవం.

భడవ. ఒక్క నిమిషం ఆలస్యం చేస్తే నేను ఆ మసాలా దోశ ముక్క నోట్లో పెట్టేసుకునే దాన్ని కదా అని కోపంలో వాడ్ని ఒక్క చెంప దెబ్బ వేసి "ముష్టి అంకుల్ లేడూ, కుష్టి అంకుల్ లేడూ.. పో. సుఖంగా నిద్రకూడా పోనివ్వరు. నిద్రలో కలలు కూడా కననివ్వరు" అని విసుక్కున్నాను. అదీ విషయం. ఆ తరువాత నేను ఎందుకు కొట్టానో చెప్పి, వాడ్ని దగ్గరకి తీసుకుని ఓదార్చాను. అప్పటి నుండీ ఈ కల విషయం మా పిల్లలిద్దరూ జ్ఞాపకం చేసి నన్ను ఏడిపిస్తుంటారు.

చిన్నప్పుడు పిల్లలు అందర్నీ ఆంటీ, అంకుల్ అంటారు. ఒకసారి మా చిన్నాడు "అమ్మా వెనకింట్లో దొంగ అంకుల్ వచ్చి తాళం బద్దలు కొట్టి ఆంటీ చైన్ ఎత్తుకెళ్ళాడుట. అంకుల్ మనింటికి ఎప్పుడొస్తాడమ్మా?" అని అడిగాడు.

చివరికి దొంగలూ, రౌడీలు, ముష్టివాళ్ళు కూడా మన సోదరులై అంకుల్ అని పిలిపించుకోవడం సోషలిజమే అయినా, పోలీసులు మీ పిల్లవాడు 'అంకుల్' అని అంత ప్రేమగా పిలుస్తున్నాడు "మీకూ ఈ దొంగతనంలో వాటా ఉందా?" అని అడుగుతారేమో అని భయపడి చచ్చా.

"అమ్మ నీ కలలో కొచ్చి ఏం చేసిందిరా?" అని పెద్దాడు చిన్నాడ్ని అడగడం, వాడు వెంటనే "బుక్ తీసుకుని అప్పచెప్పమంటుందిరా నిన్న రాత్రి. టోఫెల్ ఎగ్జామ్‌కి అలా అప్పచెప్పించుకోడం ఉండదు అని చెప్తే వినదురా" అనడం, వీడూ వాడూ తెగ నవ్వడం.

నాకు ఒళ్ళు మండి "అసలు ఇలా పనీ పాటా లేకుండా అందరి కలల్లోకీ ఎందుకొస్తానూ?" అని అరిచాను.

"స్లీప్ వాకింగ్" అన్నారు మావారు.

ఆ రోజే కాకతాళీయమో లేక నా శ్రద్ధమో కానీ మా డ్రైవర్ "రాత్రి నా కలలోకి వచ్చారు మేడం.. ఆధార్ కార్డ్ బంజారా హిల్స్‌లో, కాన్సర్ హాస్పిటల్ కాడ ఇస్తున్నారని చెప్పారు" అన్నాడు.

"నిన్న రాత్రి మా అమ్మ కలలో కదా ఉన్నాను.. డ్రైవర్ కలలోకి ఎలా వెళ్తానూ?" అని లాజిక్ అడిగాను.

"కలల్లో, దేశాలూ, ఊళ్ళూ, వీధులూ ఫాస్ట్‌గా ఎయిర్ లైన్స్ కన్నా వేగంగా దాటేసి వెళ్తుంటారు" అన్నాడు మా చిన్నాడు.

"నోరుముయ్యండి. అందరి కలల్లోకీ వెళ్ళడానికి నేనేమైనా బాబాగారినా ఈ నర్సింగ్‌కి నిన్న మధ్యాహ్నం రామానాయుడి స్టూడియో నుండి వచ్చేటప్పుడు చెప్పాను ఈ ఆధార్ కార్డ్ విషయం, అప్పుడు నిద్రపోతూ కారు తోలుతున్నట్లు ఉన్నాడు. అది కల అనుకున్నాడు" అన్నాను.

అసలు ఈ షిరిడీ బాబా ఉన్నాడే ఆయన కూడా ఇంతే. ప్రొద్దుటే నా కలలో కొచ్చి "పరమాన్నం ఎప్పుడు చేస్తావ్?" అన్నాడు ఓ నాడు.

"పరవాన్నం లేదు గిరివాన్నం లేదు పడుకోనీ బాబా!" అని అలవాటుగా విసుక్కుని అటు తిరిగి పడుకున్నానో లేదో, రెక్కలు కట్టుకుని అమెరికాలో హ్యూస్టన్‌లో, కాలేజ్ స్టేషన్‌లో ఉన్న మా అశ్విన్ దగ్గరకెళ్ళి "మీ అమ్మ పరమాన్నం పెట్టడం లేదు" అన్నాడుట.

అశ్విన్ నిద్రలేచి చూస్తే లేడు. వాడికి నా బద్ధకం తెలుసు కాబట్టి, పాపం అటుకులు వేడి వేడి పాలల్లో, పంచదార, వేయించిన జీడిపప్పూ వేసి పరమాన్నం (వాడి కొచ్చినట్లు) చేసి బాబాకి పెట్టాడుట. నాకు ఫోన్ చేసి బాబా ఇలా చెప్పాడన్నాడు. ఈయన్ని ఏ ఎయిర్ లైన్స్ వాళ్ళు ఇంత ప్రొద్దుటే ఆఘమేఘాల మీద అమెరికా తీసుకెళ్ళారబ్బా! అని ఆశ్చర్యపోయాను.

మా బామ్మ అయితే హరనాధ బాబా తన కలలోకొచ్చి కజ్జికాయలు చెయ్యమన్నాడని మా పిన్నితో చెప్పేది. పైగా "మీ రామలక్ష్మి చేసినట్లు ఎవరూ చెయ్యలేరు" అని కూడా బాబా అనేవారని చెప్పేది. మా పిన్ని మురిసిపోయి వెంటనే చేసేది. మళ్ళీ వారం గడవకుండానే బాబాగారు చేగోడీలు అడిగేవారు (మా బామ్మకి పళ్ళన్నీ గట్టిగా ఉండేవి) అలాగే ఒక్కోసారి పకోడీలూ, పచ్చిమిరపకాయ బజ్జీలు కూడా అడిగేవారు బాబా!

నేను మా ఆయనతో "ఏవండీ.. మీ ఆవిడ నా కలలోకి వస్తోంది అని ఎవడైనా అంటే తప్పుపట్టుకోకండి, నేనీ మధ్య బాబాగారిలా అందరి కలల్లోకి వెళ్లొస్తున్నాను" అన్నాను.

"ముంబై వైపు వెళితే చెప్పు అక్కడ సాయిగాడితో నాకో పనుంది" అన్నారు ఆయన ఆవలిస్తూ.

కానీ, నాకు తరచూ వచ్చే కల ఒకటుంది. పరీక్ష హాలు దగ్గరకెళ్ళాను. గంట కొట్టేసారు. నాకు నేను రాయబోయేది ఏ పరీక్షో తెలీదు. చేతిలో ఉన్న పేపర్‌లో గీతలు అర్ధంకావు. ఎవరైనా మానసిక శాస్త్రవేత్తకి చెపితే, ఈ కల గురించి బోలెడు అధ్యయనం చేసి, నా మానసిక విశ్లేషణ చేసి వింత సంగతులు చెప్తాడేమో!

అసలు మన జీవితం 'పిజ్జా' లాంటిది. సడెన్‌గా లైఫ్‌ని పిజ్జాతో పోలుస్తున్నాను అని నాకు మతి పోయిందేమో అనుకోకండి.

పిజ్జా స్క్వేర్ షేప్ బాక్స్‌లో వస్తుంది. ఓపెన్ చేస్తే రౌండ్‌గా ఉంటుంది. తీరా తినబోతే ట్రయాంగిల్‌గా ఉంటుంది. లైఫ్ కూడా ఇంతే. ఒకలా అనిపిస్తుంది.. గడుస్తుంటే ఇంకోలా టర్న్ అవుతుంది.

ఒక విషయం మాత్రం నిజం. మనిషి నిద్రలో వచ్చే కలల కన్నా, మెలుకువగా ఉన్నప్పుడు కనే కలల్ని ఇష్టపడ్డాడు. అవి నిజం చేసుకోవాలి అనుకుంటాడు.

మా డైరెక్టర్ శివనాగేశ్వరరావు మనీ సినిమా తీసేటప్పుడు ఒక సీన్ రాసుకున్నాడు. కానీ అది తియ్యలేదు. అది నాకెంతో ఇష్టమైన సీన్.

బీద కుర్రాళ్ళు జె.డి.చక్రవర్తి, చిన్నా ఒక కల కంటారు. ఫైవ్ స్టార్ హోటల్‌కి వెళ్ళినట్లు. బయట ప్రైవేటు రోడ్డూ, గేటు దగ్గర డ్రెస్‌లో బయట మహరాజులా ఉన్న గేట్ కీపరూ, రిసెప్షన్ లాంజ్‌లో అందమైన అమ్మాయీ, రెడ్ కార్పెట్ పరిచిన మెట్లూ, అన్నీ గ్రాండ్‌గా ఉంటాయి.

బెల్ బోయ్ కీ ఇచ్చి వెళ్ళిపోయాక వీళ్ళు రూం డోర్ ఓపెన్ చేస్తే ఎదురుగా ఓ చాపా, పక్కన కూజాలో నీళ్ళూ, చాపమీద చిరుగులు బొంతా ఉంటుంది.

లాజిక్ ఏంటంటే మనిషికి అనుభవంలోకి రానివి కల కనలేడు. వీళ్ళిద్దరూ స్టార్ హోటల్ బయట నుండే చూసారు కానీ లోపల ఎప్పుడూ చూడలేదు. కాబట్టి లోపల ఏం ఉందో వాళ్ళకి తెలిసే ఆస్కారం లేదు.

అలాగే జే.డి ఒక మీటింగ్‌లో ఉండగా, డీల్ సెటిల్ అయి కోటి రూపాయల సూట్‌కేస్ ఎదుటి వ్యక్తి ఇతనికి ఇస్తూ ఉండగా.. మెలుకువ వచ్చేస్తుంది. చిన్నా లేపుతుంటాడు.

"లేరా! మొద్దు నిద్రా నువ్వూ" అని.

జే.డి లేచి చిన్నాని కొడ్తాడు. "ఓ ఐదు నిమిషాలు ఆలశ్యంగా లేపచ్చుగా, కలలో అయినా కోటి రూపాయలు చూసేవాడ్ని" అని.

ఇంకోసారి అందమైన అమ్మాయికి అతనికి 'ఐ లవ్ యూ' అని చెపుతుండగా చిన్నా లేపేస్తాడు. మళ్ళీ కొడ్తాడు.

లాస్ట్‌కి దొంగతనం చేసి పరిపోతుంటే జే.డీ, జనానికి దొరికి పోతాడు. అందరూ చేతికి అందినవి పెట్టి కొట్టేస్తుంటారు. మొహం అంతా వాచి, కాళ్ళు ఒంకరబోయి అడుగు తీసి అడుగు వెయ్యలేని స్థితిలో మెలుకువ వస్తుంది.

ఎదురుగా చిన్నా కూర్చుని పల్లీలు తింటుంటాడు.

"లేపితే మంచి కల పాడు చేసావంటావనీ... లేపలేదురా.. బావుందా?" అంటాడు.

జే.డీకి పిచ్చి కోపం వస్తుంది.

"ఒరే రెండు నిమిషాలు ముందు లేపుంటే ఎన్ని దెబ్బలు తప్పేవిరా?" అని అరుస్తాడు.

మనకి కూడా మంచి కలలొస్తున్నప్పుడే, పాలవాడో, పనిమనిషో తలుపు కొట్టి లేపుతారు. ఒక్కోసారి అదే మెలుకువ వచ్చేస్తుంది. రాకూడని కలలొచ్చి భయంగానో, బాధగానో ఉంటే ఎవరూ లేపరు. మనసంతా పాడైపోయాక మనమే లేస్తాం.

ఇంకో విషయం ఆడవాళ్ళకి నచ్చనిది ఏమిటంటే ఈ కలల్లో రంగులు కనపడవు. కాజల్ కనపడ్తున్నా, ఆమె వేసుకున్న డ్రెస్ ఏ రంగుదో తెలీదు. భోంచేస్తున్నట్లు కలలో రాకూడదంటారు. కానీ 'మిధునం' లాంటి సినిమాలు చూసినప్పుడు అప్పదాసు కాకరకాయ పులుసు గురించీ, కారం పెట్టిన వంకాయకూర గురించీ అంతగా ఉరించాక రాక ఏం చేస్తాయీ?

నాకు చాలా సార్లు భోజనం కలలొస్తాయి. రుచులు తెలీవు.

సినిమా చూసినట్లే, మనని మనమే కాసేపు తెరమీద చూసుకోవచ్చు. అలాగే దేవుడు మీద ఎక్కువ ధ్యాస పెట్టుకున్న వాళ్ళకి ఆయన కనిపిస్తాడు. మనలాగే మాట్లాడ్తాడు. ఎందుకంటే మనకి ఇంకో భాష రాదుగా, అందుకే మన భాషలోనే కలలు కంటాం.

గొప్పవో, బీదవో, పెద్దవో, చిన్నవో అందరికీ కలలుంటాయి. కలలు కనే వయసు అని ప్రత్యేకంగా ఏదీ ఉండదు. ఏ వయసులో అయినా కలలొస్తాయి. అతి సుందరంగా ఉండాలంటే మనం మెలుకువగా ఉన్నప్పుడు మంచి పనులు చేస్తూ, మంచి వార్తలు చదువుతూ, మంచి దృశ్యాలు చేస్తూ, మంచి ఆలోచనలు చెయ్యాలి.

కొంతమంది సినిమా రైటర్స్‌కి కలల్లో కథలొచ్చేసి తెల్లారి లేచి రాసేసుకుంటారు. అవి కలలు కావు. మనం ఎక్కడో చూసినవి కాపీ కొట్టడానికి కొత్త మార్గం.

రాజకపూర్ 'సపోంకా సౌదాగర్' తీసి ఎప్పుడో చెప్పాడు తను డ్రీమ్ మర్చెంట్‌నని. కలల బేహారీలుగా ఉండడానికే మన దర్శకులు ఎన్నో అభూత కల్పనలతో సినిమాలు తీస్తారు. వాటికి కోట్లు ఖర్చు అవుతాయి.

మనం తీసుకునే సినిమాకి కనురెప్పలు మూసుకుంటే చాలు. అందుకే..

**"నాకూ ఒక మనసుందీ**
**ఆ మనసుకి ఆశొకటుందీ!**
**కలలు కనే కళ్ళున్నయీ..**
**అవి కలత బడితే నీళ్ళొస్తాయీ**
**మానూ మాకును కాదూ.."**

●●●

Click here to share your comments on this story.